తొలిపూజకు వేళాయె

- భారీ సెట్టింగ్‌లతో వినాయక ఉత్సవ పందిళ్లు
- కిటకిటలాడిన మార్కెట్లు
- పట్టణంలో ఎక్కడ చూసినా సందడే సందడి



లంకా మైదానంలో కొలువుదీరనున్న 117 అడుగుల పంచముఖ మహాగణపతి



కిటకిటలాడుతున్న పూజా సామగ్రి స్టాళ్లు



కొత్త గాజువాకలో వినాయక విగ్రహాల స్టాల్

గాజువాక: వరసిద్ధి వినాయకుడికి తొలిపూజ చేసేందుకు గాజువాక ముస్తాబైంది. ఎక్కడికక్కడ చవితి పందిళ్లు, సందళ్లు కనిపిస్తున్నాయి. ఆదివారం ఉదయం నుంచే మార్కెట్లు పూజా సామాగ్రి కొనుగోలుదారులతో కళకళలాడాయి. కొత్తగాజువాక నుంచి సినిమాహాలు కూడలి వరకు ప్రధానమార్గం కిక్కిరిసిపోయింది. అధికారిక లెక్కల ప్రకారం 82చోట్ల మండపాలు వేస్తున్నారు. అనధికారికంగా మరో 150 వరకు మండపాలు వెలుస్తున్నాయి. ఎక్కడచూసినా యువకులు ఉత్సవ ఏర్పాట్లలో తలమునకలై ఉన్నారు. పాతగాజువాక, కొత్తగాజువాక, కణితి రోడ్ ప్రాంతాల్లోని ప్రధాన కూడళ్లవద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లలో వినాయకుడి విగ్రహాలు, పూజా సామాగ్రి విక్రయిస్తున్నారు. కొంతమంది ప్రతిమలను ఆర్డర్లపై తయారు చేయించుకోగా, మరికొంతమంది రెడీమేడ్ ప్రతిమలను కొనుగోలు చేసి తమ మండపాలకు తరలించారు. కొనుగోలుదారులతో గాజువాక మెయిన్‌రోడ్డు, కణితి రోడ్డు కిటకిటలాడాయి.

కళ్లు మిరిమిట్లు గొలిపే సెట్టింగ్‌లు

వినాయక ఉత్సవాలు నిర్వహణకు పట్టణంలో కళ్లు మిరిమిట్లు గొలిపే విధంగా మండపాలను తయారు చేశారు. రంగురంగుల వస్త్రాలను ఉపయోగించి సినిమా సెట్టింగ్‌లను మరిపించే విధంగా పందిళ్లను రూపొందించారు. వినూత్న రీతిలో మండపాలను ఏర్పాటు చేసి గణనాథుని ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. వీటికోసం నిర్వాహకులు నిపుణులైన కళాకారులను పక్క రాష్ట్రాలనుంచి కూడా తీసుకొచ్చారు. లంకా మైదానంలో ఎస్వీ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 117 అడుగుల పంచముఖ మహాగణపతి విగ్రహంవద్ద ఆలయాన్ని తలపించే విధంగా సెట్టింగ్ రూపొందించారు. బీహెచ్‌ఈఎల్ దరి గ్లోబెక్స్ థియేటర్స్‌వద్ద మహాగణపతి యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 112 అడుగుల ఆయుర్ గణపతి విగ్రహం కోసం గోల్డెన్ టెంపుల్ నమూనాలో మండపాన్ని తీర్చి దిద్దారు. ఇంకా అనేక ప్రాంతాల్లో వివిధ సెట్టింగ్‌లతో పందిళ్లు ఏర్పాటు చేశారు. పర్యావరణానికి హాని కలగకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకొంటున్నారు.

ధరలు చూస్తే దడ

లంబోదరుడి పూజా సామాగ్రి ధరలు చుక్కలనంటాయి. మార్కెట్‌లో కొబ్బరికాయలు, పెడ అరటిపండ్లు, పత్రిదళం, మామిడి ఆకులు, అరటి ఆకు, పువ్వులు, ఒక యాపిల్, రెండు చెరుకు ముక్కలు, జామకాయలు, వినాయకుడి పూజా పాళి (పల్లకి)ని ఒక సెటుగా రూ.160లకు అమ్ముతున్నారు. ఆరు అడుగుల విగ్రహం రూ.10వేలకు దగ్గకుండా విక్రయిస్తున్నారు. ఉత్సవ నిర్వహణలో పడి నిబంధనలపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే నిర్వాహకులపై ఈసారి పోలీసులు కఠినంగా వ్యవహరించనున్నారు. నిబంధనలను నిర్లక్ష్యం చేసినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని గాజువాక సీఐ ఎల్.భాస్కరరావు ఈ సందర్భంగా తెలిపారు.

మట్టి గణపతినే పూజిద్దాం

పెదగంట్యాడ: ఆది దేవుని తొలి పండగ, వినాయకచవితి ఉత్సవాల్లో మట్టితో చేసిన గణనాథుని విగ్రహాలనే పూజించాలని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీవీఎంసీ 75వ వార్డు పరిధిలోని పెదగంట్యాడ ఈఎస్‌ఐ ఆస్పత్రి వద్ద గల జీఏఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత గొందేశి అప్పలరెడ్డి, శ్రీదేవి ఆధ్వర్యంలో 500 మందికి మట్టి ప్రతిమలను ఆదివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, మార్టుపూడి పరదేశి, గొడ్డు కన్నారావు, కొయ్య భారతి, చందన సిస్టర్స్ తదితరులు పాల్గొన్నారు.



గ్లోబెక్స్ వద్ద 112 అడుగుల ఆయుర్ గణపతి

76వ వార్డు నడుపూరులో..

పర్యావరణ హితమైన మట్టి గణపతినే ప్రతి ఒక్కరూ పూజిద్దామని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు తాటికొండ కాశి ఆధ్వర్యంలో జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని నడుపూరులో మట్టి గణపతి ప్రతిమలను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడికొండ కాశి ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, గాంధీనగర్ అధ్యక్షుడు కాతా బాలకృష్ణ, తాడికొండ సుదర్శన్, గుడివాడ అమ్మన్న, మంత్రి శంకరనారాయణ, రౌతు గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణహిత వినాయక చవితి జరుపుకుందాం

కూర్మన్నపాలెం: వినాయక చవితి పండను పురస్కరించుకుని పర్యావరణానికి హాని లేని మట్టి వినాయక ప్రతిమలను గాజువాక నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉచితంగా పంపిణీ చేశారు. జీవీఎంసీ 87వార్డులోని అప్పికొండ వెలమవీధి, శెట్టిబలిజవీధి, కణితి గవరవీధి, వడ్లపూడి ఎన్.టీ.ఆర్.కాలనీ తదితర ప్రాంతాల్లో శ్రీని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మట్టి గణపతి విగ్రహాలను ట్రస్ట్ చైర్మన్ కోమటి రమాదేవి ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో 87వ వార్డు వైఎస్సార్ సీపీ ఇంచార్జ్ కోమటి శ్రీనివాసరావు, సచివాలయ కన్వీనర్ వర్రె రాజు, నాయుడు, అతికంశెట్టి రవి, కాండ్రేగుల రమణ, కర్రం లక్ష్మి, కోనేటి పారిపల్లి, జెర్రిపోతుల ఈశ్వరరావు, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు. జీవీఎంసీ 87వ వార్డు పరిధి పాతవడ్లపూడి దళితవాడలో వైఎస్సార్‌సీపీ గాజువాక నాయకుడు బొడ్డ గోవింద్ ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాల పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చిత్రాడ వెంకటరమణ, ఈర్ల శ్రీరాములు, గాలి నూకరాజు, అప్పారావు, జి.రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

షీలానగర్‌లో...

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని అనూరాధా ఆటో సర్వీసెస్ (పెట్రోల్ బంక్)లో భక్తులకు మట్టి వినాయక ప్రతిమలను గాజువాక ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఆదివారం పెట్రోల్ బంక్‌లో జరిగిన కార్యక్రమంలో ఆటో సర్వీసెస్ ప్రతినిధి రమేష్ చంద్ర మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా 2 వేల మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశామన్నారు.

సంపత్ వినాయక ఆలయంలో..

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి నిర్వాసితకాలనీ పెదమడకలోని సంపత్ వినాయక ఆలయంలో సోమవారం నుంచి ఈనెల 27వ తేదీ వరకు వినాయక నవరాత్రులు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది. తొమ్మిది రోజుల పాటు విశేష పూజలు, హోమాలు, అభిషేకాలు జరిపించనున్నట్టు వివరించారు.



75వ వార్డులో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తదితరులు



నడుపూరులో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న తిప్పల దేవన్‌రెడ్డి,తాటికొండ కాశి



87వ వార్డులో మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్న కోమటి శ్రీనివాసరావు

ఆకట్టుకుంటున్న సెట్



అక్కిరెడ్డిపాలెం: గ్లోబెక్స్ పక్కన గల సీఎంఆర్ ఖాళీ స్థలంలో 112 అడుగుల భారీ ఆయుర్ గణపతి కొలువుదీరనున్నాడు. కొలువు తీరాడు. 21 రోజుల పాటు చవితి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు బచ్చల త్రిమూర్తులు తెలిపారు. ఈ మేరకు సెట్టింగ్ విశేషంగా ఆకట్టుకుంటోంది.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాపు నేస్తం లబ్ధిదారులు

అక్కిరెడ్డిపాలెం: కాపులకు పూర్తి స్థాయిలో న్యాయం జరిగిందంటే అది ఒక్క ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి వల్లేనని 68వ వార్డు వైఎస్సార్ సీపీ మహిళా అధ్యక్షురాలు గొంతిన వెంకటలక్ష్మి అన్నారు. కాపు నేస్తం ద్వారా నాలుగో విడత ఆర్థిక సాయం అందజేయడంతో లబ్ధిదారులైన కాపు మహిళలు ఆదివారం 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సంగ్రాన నూకరాజు, వరదాడ వెంకటరమణ, నేలపాటి సత్యవతి, నంబారు రాజు, ఎం.సత్యవతి, నేలపాటి శ్యాంబాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విశ్వకర్మ విగ్రహావిష్కరణ



భెల్‌లో శ్రీ విశ్వకర్మ స్వామిని దర్శించుకుంటున్న గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: భెల్ (హెచ్‌పీవీపీ) కల్యాణ మండపంలో శ్రీ విశ్వకర్మ జయంతి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం జరిగిన మహోత్సవాల్లో బ్రహ్మశ్రీ గిడిజాల సత్యనారాయణ, బాల భాస్కరమ్మ చేతుల మీదుగా శ్రీ విశ్వకర్మ స్వామి విగ్రహ ఆవిష్కరణ జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పాల్గొన్నారు. సంస్థ ఏజీఎం (ప్రొడక్షన్) ముండా, సీనియర్ డీజీఎం (ప్రొడక్షన్) ప్రొఫైల్ కుమార్ మహాపాత్ర, హెచ్‌కేపి మిశ్రా, సీనియర్ మేనేజర్ చంద్రశేఖర్, గుర్తింపు యూనియన్ అధ్యక్ష ప్రధానకార్యదర్శులు బొండా బాబూరావు, సుభాకర్ సాహూపాల్గొన్నారు.

గాజువాకలో..

గాజువాక: గాజువాక గ్రంథాలయంలో విశ్వకర్మ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వకర్మ చిత్రపటానికి రిటైర్డ్ ఇంజనీర్ వై.వి.రమణ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి బి.చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెంలో..

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు పరిధి కణితి గ్రామంలో విశ్వబ్రాహ్మణ సేవ సంఘం ఆధ్వర్యంలో శ్రీశ్రీ విశ్వకర్మ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గాజువాక నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ తిప్పల దేవన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు.

ఉక్కునగరంలో..

ఉక్కునగరం: ఆదిశిల్పి విశ్వకర్మ జయంతి మహోత్సవం ఆదివారం ఉక్కునగరంలో ఘనంగా జరిగింది. విశ్వకర్మ పూజా కమిటీ ఆధ్వర్యంలో సెక్టార్-5 మరిడిమాంబ ఆలయం సమీపంలో నిర్వహించిన కార్యక్రమంలో శాస్త్రోక్తంగా హోమాలు చేశారు. స్టీల్ ప్లాంట్ డైరెక్టర్ (కమర్షియల్) డీకే మొహంతి ముఖ్య అతిథిగా, సీజీఎం (వర్క్స్) ఎన్.వి. స్వామి , వైఎస్సార్ కాంగ్రెస్ నాయకులు దేవన్‌రెడ్డి, స్టీల్‌ప్లాంట్ సీఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నిమజ్జనోత్సవం ఏర్పాట్లు పరిశీలించిన పోలీసు అధికారులు

ఉక్కునగరం: వినాయక నిమజ్జనోత్సవం సందర్భంగా తీసుకుంటున్న ఏర్పాట్లను ట్రాఫిక్ పోలీసు ఉన్నతాధికారులు పరిశీలించారు. సోమవారం నుంచి కొందరు నిమజ్జనం జరుపుతారు. ఈ నేపథ్యంలో నగర ట్రాఫిక్ ఏడీసీపీ జి. శ్రీనివాస్, ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్ కుమార్‌లు ఆదివారం అనుపు జరిగే స్టీల్‌ప్లాంట్ కణితి రోడ్డు, అప్పికొండ బీచ్, రావుల చెరువు ప్రాంతాలను సందర్శించారు. స్టీల్‌ప్లాంట్ ట్రాఫిక్ సీఐ జి. ఉమామహేశ్వరరావు ఆయా ప్రాంతాల్లో చేపడుతున్న ఏర్పాట్లను వివరించారు. ఈ సందర్భంగా సీఐ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ అనుపు సందర్భంగా ఆయా ప్రాంతాల్లో బారికేడ్లు, లైటింగ్, పబ్లిక్ అడ్రసింగ్ సిస్టం, స్విమ్మర్లను సిద్ధం చేశామన్నారు. చిన్న పిల్లలను దూరంగా ఉంచాలని, మద్యం సేవించి రాకూడదని, సముద్రంలో దిగరాదని సూచించారు. నిమజ్జనోత్సవం ప్రశాంతంగా జరిగేలా పోలీసు సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

పలు చోట్ల ప్రత్యేక పూజలు

పెదగంట్యాడ: స్టీల్ వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షుడు పిట్టారెడ్డి ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు.పెదగంట్యాడ జంక్షన్‌లో నిర్వహించిన ఈ వేడుకల్లో సీనియర్ కార్మిక నేత బసా సాధురెడ్డి విశ్వకర్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మార్టుపూడి పరదేశి, నందికి తాతరావు, గొందేశి వెంకటరమణారెడ్డి, ములకలపల్లి వెంకటేష్, గొందేశి రాము, అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు. జీవీఎంసీ 75వ వార్డు పరిధిలోని నెల్లిముక్కు రామాలయం పక్కనున్న గోవిందమాంబ సమేత వీర బ్రహ్మేంద్ర, కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో విశ్వకర్మ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్ రెడ్డి, వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీభాయ్, మహేశ్వరరెడ్డి శ్రీరామూర్తి, కణితి అప్పలరాజు పాల్గొని పూజలు చేశారు.

అభినందనలు



నాగిరెడ్డిని సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

గాజువాక : వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గం క్లస్టర్ అధ్యక్షులను గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అభినందించారు. తమను క్లస్టర్ అధ్యక్షులుగా నియమించిన సందర్భంగా ధర్మాల శ్రీనివాసరావు, రాజాన వెంకటరావు, ఎస్.ఎం.డి.గౌస్, బొడ్డ గోవింద్ ఎమ్మెల్యేను కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు.

948వ రోజుకు చేరిన దీక్షలు



మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కార్మికులు, ఉద్యోగులు చేస్తున్న దీక్షలు ఆదివారం నాటికి 948వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

గుండె వైద్య శిబిరం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ అంబేడ్కర్ కళాక్షేత్రంలో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్ కోపరేటివ్ స్టోర్స్ అధ్యక్షులు బి.టి. జగదీశ్వరరావు ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ ఉద్యోగులు, కోపరేటివ్ సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన శిబిరాన్ని స్టీల్‌ప్లాంట్ సీఐ వి. శ్రీనివాసరావు ప్రారంభించారు. ఇండస్ ఆస్పత్రి కార్డియాలజిస్ట్ డాక్టర్ సుజాత, డాక్టర్ మాధవ్‌లు శిబిరంలో రోగులను పరీక్షించారు. కార్యక్రమంలో ఆస్పత్రి ప్రతినిధి రమేష్, కార్మిక నాయకులు పి.వి.ఎస్. కుమార్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథి నరేంద్ర మోదీ



మొక్కలు పంపిణీ చేస్తున్న కరణంరెడ్డి నర్సింగరావు

గాజువాక: సంక్షేమ పథకాలను ప్రతి పేదవాడికి చేరువ చేసిన మహోన్నత వ్యక్తి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అని బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు అన్నారు. మోదీ జన్మదినాన్ని గాజువాకలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ఆలయాల్లో పూజలు, అభిషేకాలు చేసిన బీజేపీ నాయకులు అనంతరం మొక్కలను పంపిణీ చేశారు.కార్యక్రమంలో స్థానిక నాయకులు జ్యోతి, గూటూరు శంకరరావు, బాటా శ్రీనివాస్, శ్రీరామ్మూర్తి, నాగేశ్వరరావు, కట్ట పద్మ, రోహిణి, జీలకర్ర రమణ, బొండా శ్రీదేవి పాల్గొన్నారు.